# రంగుల రవ్వల నెక్లెస్

"బ్రహ్మమూ... ఓ బ్రహ్మమూ !"

పది నిమిషాల్లో పోలింగ్ ముగుస్తుందనగా మరో పదిమంది ఓటర్ల కోసం వెతుకున్న పొలిటికల్ పార్టీ వర్కర్‌లా అంగలేస్తూ కంసాలి దుకాణంలో కొచ్చిన లక్ష్మీపతి కొండముచ్చులా ఇకిలించాడు.

ఊరివారి నోళ్ళల్లో బ్రహ్మంగా మిగిలిన బ్రహ్మాచారి పలుకలేదు. వీపు గోడకానించి ఆసనం వేసుక్కూచున్నాడు. చేతులు నెత్తిమీద, చూపులు నేలమీద.

కుడిపక్క తాతలనాటి కట్టెపెట్టె. అందులో ముత్తాతల నాటి పనిముట్లు. ఎడమపక్క చిన్నపాటి కుంపటి. దాని మీద కొలుపుదీరిన చిన్నారి కొలిమి. కొలిమిలో వారం రోజుల క్రితం కాలి బూడిదైన బొగ్గులు గాలితో ఆడుకుంటున్నై. కొలిమి పక్కన గాలి ఊదే గొట్టం విశ్రాంతి తీసుకుంటోంది.

... స్వర్ణకారుల స్వర్ణయుగానికెప్పుడో కాలంచెల్లి పోయింది. ఒక్క రోజు పనుంటే వారం రోజులు చేతులు ముడుచుక్కూచోవాల్సివస్తుంది. ముక్కుపుడక నుండి ముత్యాల హారం దాకా, అన్ని రకాల నగలు పట్నం షోరూముల్లో రెడీమేడుగా దొరుకుతున్నై.

ధనవంతులకే బంగారంమ్మీద మోజు. మోజున్నవాళ్ళే నగలు చేయించుకుంటారు. మరిప్పుడు ధనవంతులు పల్లెటూళ్ళల్లో దర్జాగా బతికే రోజులు కావాయె. సతాయింపులు, బెదిరింపులు భరించలేక వాళ్ళంతా ఆస్తులమ్ముకుని పట్నాల కెగబడిరి. ఊరిడిచిన మా రాజులకు ఊర్లె వున్న దరిద్రులతో పనేమిటి ?... బెల్లమ్మీది ఈగల్లా బ్రహ్మాచారి బుల్లి మెదడులో ఆలోచనలు ఎగురుతున్నై.

"ఏయ్, బ్రహ్మాచారీ ! ఎటు జూస్తున్నవోయ్ ?" భుజం పట్టి కుదిపాడు లక్ష్మీపతి. మగత నిద్రలోంచి మానవ లోకానికొచ్చి బ్రహ్మాచారి తల భారంగా పైకి లేచింది. ముప్పయేళ్ళ వయసులో ముదిరిపోయిన లేమి కళ్ళల్లో కదలాడింది.

ఎదురుగా ఉన్న పట్టెడ మొద్దు మీద చేతులానించి హరివిల్లులా ముందుకు వంగాడు. గాలితోపాటు ఆశను గూడా గుండెల నిండా పీల్చుకున్నాడు.

"రా... రా లక్ష్మీపతి బావా ! కూచో..." పట్టెడ మొద్దు కవతల పరిచిన చాప చూపించాడు. కులమతాల కతీతంగా వరుసలు కలుపుకుని పిలుచుకోవడం పల్లెటూరి ప్రత్యేకత.

చాపమీద పేరుకుపోయిన బూడిదను పంచతో దులుపుతూ "ఈ నడుమ పనులు లేక పరేశానై పోతున్నావు గదూ!" మరోసారి నవ్వాడు లక్ష్మీపతి. ఆ నవ్వు వెనకుంది సానుభూతో దెప్పిపొడుపో అర్థంగాలేదు.

తండ్రి చనిపోతూ అందించిన లక్షల ఆస్తుల్ని ఒడుపుగా కోట్లకు పెంచేసిన లక్ష్మీపతికి రాజకీయంగా కాసింత పలుకుబడుంది. అజ్ఞాత వీరుల్ని ఆకట్టుకునే నేర్పు ఉంది. సమయమొస్తే బూర్జువాల దుమ్ము దులపాల్సిందేనని ఒంటి కాలు మీద లేచే చాకచక్యముంది. పైన మూలవిరాట్టు కాళ్లు పట్టుకుని కింద మూడొందల మంది జుట్లు పట్టుకోవడం వెన్నతో పెట్టిన విద్య. వంశాంకురాన్ని ప్రసాదించలేని మొదటి భార్య గొడ్డుముండా, దరిద్రం బండా, శనిదేవతా మొదలగు దెప్పిపొడుపుల్ని, తిట్లను భరించలేక ఉరేసుకొని మరో లోకానికెళ్ళిపోయింది. యాభయ్యేదేళ్ళ వయసులో ఇరవైయ్యేళ్ళ రంభ రెండో భార్యగా వచ్చింది. కొత్త పెళ్ళాం సరికొత్త కోర్కె తీర్చాల్సిన బాధ్యత నెత్తిమీదేసుకొని పరుగెత్తుకొచ్చాడు.

"నిజమే బావా ! చేతికి పనిలేక బుర్రకు చెదలు పట్టినట్టుంది. మీలాంటి మారాజులు నగలు చేయించుకుంటేనే గదా నాలుగు మెతుకులు మా నోట్లెకొచ్చేది. పని లేకుంటే మా బతుకు - కంకరదేలిన రోడ్డు మీద కందెనెలేని బండిగీరలు నడిచినట్టుంది."

"చెయ్యిదిరిగిన పనోల్లు పస్తులుంటే నా ప్రాణం గిలగిల్లాడుతుందోయ్. అందుకే నీకో పంజెప్పాలని వచ్చిన."

సూర్యకిరణాలు సూదుల్లా కిటికీలోంచి చొచ్చుకొచ్చి వెండి రేకుల్లా పట్టెడమొద్దు మీద పరుచుకుంటున్నై.

పల్లపు ప్రదేశంలో నీటి ప్రవాహంలా బ్రహ్మాచారి జీవనాడుల్లో ఉత్సాహం ఉరకలేసింది.

"అట్లానా ? ఏం పనిజెయ్యాలె బావా !"

"ఓ పెద్ద నగ లేక నాభార్య మెడ మొండిగా కనబడ్తుందట. మాంచి రవ్వల నెక్లెస్ చేసియ్యాలె".

రవ్వల నెక్లెసా ! హమ్మయ్య... పెద్దపనే. కూలి బాగానే గిట్టుతుంది. కళ్ళల్లో కాంతి రేఖలు.

"తప్పకుండా చేస్తా బావా ! ఇగో... ఏ డిజైన్ కావాలెనో చూస్కో" డిజైన్ల పుస్తకం ముందుంచాడు.

"నీ డిజైన్లు గిజైన్లు నాకేం దెల్సు ! మా ఇంటి కొచ్చి మీ చెల్లెనడిగి తెలుసుకో. కానీ... ఒక్క కండిషన్".

"ఏం... దదీ !"

"ఆ నగను మా ఇంట్లనే కూచుని చెయ్యాలె. ఎన్ని రోజులైనా ఫరవాలేదు".

"మీ ఇంట్ల కూకుండి చెయ్యాల్నా ? గట్లెందుకూ ?"

"అట్లెందుకంటే... ఇది కలియుగం గదా! ధర్మం ఒంటికాలం మీద నడుస్తుంది గదా!"

"కానీ పట్టెడమొద్దూ, కొలిమీ, సామాను అన్నీ అక్కడుండాలె, ఏదొక్కటి లేకున్నా వెతుకులాటనే".

"నిజమే. అవన్నీ నువ్వే తెచ్చుకోవాలె. భోజనం టయానికి మీ ఇంటికొచ్చి పోవచ్చుగూడా".

బ్రహ్మాచారి బుర్రలో సంగడి బొంగరాలాడినై. ఉక్రోశం ఉబికొస్తోంది.

"ఏనోడంటే పాత చెప్పనుకున్నావా ? ఎట్లపడితే గట్ల మాట్లాడ్తే ఊకుంటామా ? నీ పనికో దండం, నీకో దండం... అనాలన్పించింది కాని... పెళ్ళాం పిల్లల ఆకలి చూపులు కళ్ళల్లో కదలాడినై. గర్భ కుహరాన్ని పెకిలించుకు వచ్చిన మాటలు గొంతులో బందీలైపోయినై.

ఇలాంటి దీనస్థితి వస్తుందని కలలో గూడా ఊహించలేదు. ఎండిపోయిన పెదాల మీద నిర్జీవమైన చిరునవ్వు తచ్చాడింది. సరేననక తప్పలేదు.

డిజైన్ల పుస్తకం చేతికిస్తూంటే రంభ మోహం విరబూసిన గులాబైంది. వయసు పొంగుల వయ్యారాల్లో కన్పిస్తున్నై. నిమిషానికోసారి పైట సవరించుకుంటూ అరమోడ్పు కళ్ళతో పుటలు తిరగేసింది.

డిజైన్ సెలెక్టయింది. లక్ష్మీపతి ఊపిరి పీల్చుకుని

"రవ్వల నెక్లెస్ చెయ్యడమంటే బువ్వ పిసుక్కునే పోరగాండ్ల ఆట కాదోయ్ బ్రహ్మమూ! జెర్రంత వంకరైనా ఊరంతా నవ్విపోతరు" పడుచుపెళ్ళాం ముందు ఠీవి ఒలకబోశాడు.

మూతి మూడు వంకర్లు తిప్పి ఆరడుగుల్లో లోపలికెళ్ళిపోయింది రంభ.

"నాకా సంగతి తెలుసు బావా !"

"అయితే... ఎన్ని రోజులల్ల చేసిస్తవ్ ?"

"వేరే పనేదీ ముట్టుకోకుండా చేస్తే వారం రోజులౌతుంది."

"అట్లనా... రోజుకో పది రూపాయల కూలీ అనుకున్నా డెబ్బై రూపాయలౌతుందన్న మాట..."

పట్టులేని కథను పట్టుకు వేళ్ళాడ్తూ వేలకోట్లు సంపాదించే లక్ష్యంతో వందలకోట్లు ఖర్చుచేసి సినిమా తీసి దివాలా దీసిన నిర్మాతలాగైపోయాడు బ్రహ్మాచారి.

"డెబ్బై... డె... బ్బై... రూపాయలేనా ? తొమ్మిది బిళ్ళల రవ్వల నెక్లెస్ కూలి ఒట్టి డెబ్బయా ?"

"గట్లంటవేందోయ్ ! పాపమంటే దోషమంటావా ? పిల్చి పనిస్తే పల్చనైపోయిన్నా ?"

"కాదు బావా ! పాత నగల్ని కరగడం, బిళ్ళల మీద రకరకాల డిజైన్లు చెక్కడం, రంగుల రాళ్ళు పొదగడం... బోలెడు పనుంది బావా, అదంతా చాలా సున్నితమైందాయె".

"అయితే ... ఎంతియ్యమంటావ్ ?"

"ఇదే పనికి పట్నంల వెయ్యి రూపాయలకు తక్కువియ్యరు. కాని... ఇక్కడ... నీ దగ్గర... నా కంత ఆశలేదు".

"ఓహో ! మరెంతియ్యమంటవ్?"

"ఓ... మూడొందల యాభై ఇవ్వు. సరిపెట్టుకుంట".

"ఓర్నీ..." బెదిరిపోయాడు లక్ష్మీపతి.

"ఆఫ్టరాల్... ఒకే ఒక నగకు రోజుకు యాభై రూపాయల కూలియ్యాలెనా ? నా సంపాదన గిట్లుంటే బంగారు ఇటుకల్తోని ఇల్లు గట్టెటోణ్ని, ఆశగ్గూడా ఓ హద్దుండాలెనోయ్. ఓ... వంద రూపాయలిస్తాలే".

"నువ్వే గట్లంటే మేమెట్ల బతకాలె బావా ?"

"నువ్వు బతకాలె ననేగదా నగ నీ దగ్గర చేయిస్తుంది. వందల రూపాయల కూలీ అంటే మాటలా !"

"కాదురా ముండాకొడుకా ! నువ్వోసారి నా లెక్క కండలు కరిగించి, ఊపిరి బిగపట్టి గాలి ఊదుకుంట బొగ్గుల మీద బంగారాన్ని కరిగిస్తే తెలిసేది. ఆ కష్టమేంటిదో..." అందామంటే ధైర్యం చాలలేదు. ఆవేశాన్ని అణగదొక్కక తప్పలేదు.

"ఊహుఁ పెద్ద నగ, గద బావా ! కూలి గూడా ..."

"కూలి పెద్దగానే దండాలంటవ్."

"పాపం గుడ్డివాడు గదా అని పిలిచి పిల్లనిస్తే పిల్లకు మెల్లెకన్నని కస్సుబుస్సు మన్నడట ఎవడో పెళ్ళికొడుకు".

"అదంతా ఎందుగ్గాని ఓ ఇరవై తగ్గించుకో. మూడొందల ముప్పయివ్వు".

అరగంట తర్జన భర్జన సాగింది.

వందయాభై వరకొచ్చాడాయన. మూడొందలకు దిగాడీయన. అంతకంటే తక్కువైతే కుదరదని తేల్చి పారేశాడు.

అఫ్టరాల్ అవుసుల పనికి అంత కూలి ఇవ్వాల్నా ? ఎంత జెప్పినా వినడేందీ ?

నా మాటంటే వీనికి వీసమెత్తు విలువగూడా లేదు.

కుతకుత లాడాడు లక్ష్మీపతి. కాని బయట పడితే భంగపాటు తప్పేట్టులేదు.

నగ చేయించకపోతే పెళ్ళాం దృష్టిలో గడ్డిపోచైపోవాలి.

"సరే... చెయ్" కనుబొమలెగిరి పడినై.

వంద రూపాయల అడ్వాన్సుతో పని ప్రారంభమైంది. పాపంలా పెరిగిపోయిన పచారీ కొట్టు కాతా కింది వెళ్ళిపోయిందా వంద.

తాకట్టులో దక్కిపోయిన ముక్కు పుడకలు, ఉంగరాలు, కమ్మలు, మంగళ సూత్రాలు, రింగులు, గెంటీలు కరిగించి బంగారాన్ని శుద్ధి చెయ్యడం, మోల్డింగ్ పొయ్యడం, బిళ్ళలుగా కట్ చెయ్యడం, ఆకు రాయితో ఆకారాలు చెక్కడం, బిళ్ళలకు తుది మెరుగులు దిద్దడం, రాళ్ళను తగు సైజుకు తరుక్కు రావడం, రంగురంగుల రాళ్ళను వివిధ ఆకారాల బిళ్ళలకు తాపడం...

వెనకకు కాఫీ గొలుసు తయారు చెయ్యడం.... నిద్రాహారాలు తగ్గించుకోవాల్సి వచ్చింది.

రక్తాన్ని చెమటగా మార్చి రోజూ ఉదయం నుండి రాత్రి దాకా తపోదీక్షలా చెయ్యాల్సి వచ్చింది.

అన్నమాట ప్రకారం రవ్వల నెక్లెస్ సకాలంలో తయారవుతోంది.

చివరి రోజు...

బ్రహ్మాచారి ఇంటి నుండి బయలుదేరాడు. భార్య ఎదురొచ్చి

"పిల్లలు ఆకలికి తల్లడిల్లిపోతున్నారు. ఇయ్యాల నన్నా బియ్యమొస్తయా ?" అడిగింది ప్రాణాలన్నీ కళ్ళల్లో పెట్టుకుని.

"ఇయ్యాల్ల నగ పూర్తవుతుంది. మిగతా కూలి డబ్బులొస్తై. దుకాండ్ల పాత బాకి ఇచ్చేసి బియ్యం గియ్యం దెస్తా. రాత్రికి మనమంతా కడుపునిండా తినొచ్చు." శృతి తప్పిన వీణలా వణికే గొంతు హామీ ఇచ్చింది.

ఆ మాటలు తియ్యగా విన్పించినై భార్యకు. కాని అదే రోజు అర్జంట్ పనేదో లక్ష్మీపతిని హైద్రాబాద్‌కు పిలిపించుకుంది.

బ్రహ్మాచారి గుండెల్లో బ్రహ్మాండం కదలాడింది. అయినా... రంభ అందించిన చాయ ఆసరాతో సాయంత్రానికల్లా రవ్వల నెక్లెస్ తుది మెరుగులు దిద్దుకుంది. ధగధగా మెరిసిపోతోంది. బాగా కుదిరింది.

రంగు రంగుల రాళ్లు పొదిగిన తొమ్మిది బిళ్ళల రవ్వల నెక్లెస్. మద్య బిళ్ళలో - కమలం లోంచి ఉదయిస్తున్న బాల భాస్కర కిరణాలు, అటు నాల్గు, ఇటు నాల్గు బిళ్ళల్లో నెమళ్లు, రామచిలుకలు, జింకలు, ఓంకారాలు మనసును దోచేస్తున్నై. బిళ్ళలు చెక్కడములో, రాళ్ళు పొదగడములో పనితనం ఉట్టి పడుతూంది. సంతోషముతో రంభ గుండెలుప్పొంగినై.

"హబ్బా ! ఇట్లాంటి దాని కోసమే కలలుగన్నాను బ్రహ్మాచారన్నా. ఇదిప్పుడు నా ప్రాణమన్నా !" మురిసిపోతూ నగను కళ్లకద్దుకుని గుండెలకు హత్తుకుంది. మొగల్ చక్రవర్తి సైన్యాలను మొదటిసారి ఓడించిన రాణా ప్రతాప్‌లా సంబరపడిపోయాడు బ్రహ్మాచారి.

"ఒక్కొక్కరాయి పొదిగేందుకు వందల చెమట బిందువులు రాలినయమ్మా. నా శక్తి యుక్తులన్నీ ధారబోసి చేసిన చెల్లెమ్మా !".

"దీనికెంత కూలిచ్చినా తక్కువేనే అన్నా. ఏ జన్మల ఏ పూజ చేసిననో నీ చేతులల్ల కళా దేవత కాపురముంది" నెక్లెస్ నాసాంతం ముద్దాడింది.

"అమ్మా... నా కూలీ డబ్బులూ ... !" అడగలేక అడిగాడు.

"ఆ సంగతి నాకు దెల్వదన్నా. రేపు పొద్దున వచ్చి తీస్కపో, కానీ... కాని..." పెదాలు వణికిపోయినై. వెయ్యిరేకులుగా విచ్చుకున్న ముఖారవిందము ముడచుకుపోయింది.

"ఏందమ్మా... చెప్పు తల్లీ !"

"ముసలి మొగుణ్ని కట్టుకున్న వయసు పెళ్ళానికి మిగిలేది నగల సుఖమేగదన్నా. నా కదన్నా దక్కింది..." రంభ కళ్ళల్లో కారుమబ్బులు కదలాడినై.

పొత్తి కడుపులో తెడ్డుతో కలెబెట్టినట్లైంది.

.... అయ్యో కట్నపిశాచమా ! ఈమె తండ్రికి కట్నమిచ్చే తాహతుంటే ఇట్లా అవస్త పడేదా !... మనసు మెలిపెట్టింది.

మర్నాడు కూలీ డబ్బులడిగేందుకొచ్చాడు.

"ఏం రా బ్రహ్మచారీ !" లక్ష్మీపతి విరుచుకు పడ్డాడు.

"కండ్లకు కావురమెక్కిందా ?"

మాటలు కావవి, కొరడా దెబ్బలు.

"ఏమైందీ !... ఏమైంది లక్ష్మీపతి బావా !" హడలిపోయాడు. గుండె గుబగుబలాడింది.

"బావా బావా అనుకుంటనే బావ పెండ్లాన్ని మానభంగం జెయ్యాలనుకున్నావురా !" గల్లాపట్టుకున్నాడు. పళ్ళు పటపటలాడినై.

"గిదేందీ ! నేనంత పాపిష్టిని కాను బావా ! నీ భార్య... నీ భార్యంటే నాకు చెల్లెలు. నా చెల్లెలు లాంటిది బావా!" బిగుసుకుంటున్న లక్ష్మీపతి చేతుల్లో - సింహం చేతిలో చిట్టెలుకై పోయాడు. ఊపిరి పీల్చుకోవడం కష్టమైంది.

"క్యా... క్యావాలంటే..." చేతులు జోడించాడు "ఆమెనే అడుగు... బావా !"

గల్లా విడిచాడు.

"దాన్నడిగే దేందిరా దరిద్రుడా ! పాప మన్నోనికే పంగనామాలు పెడ్తున్నావు గదా ! నా పెండ్లాం బుద్ధి చెడలేదు కాబట్టి తప్పించుకుందటా..."

బంగారు నగలో సింగారాన్ని సృష్టించిన బ్రహ్మచారి చెంపలు ఛెళ్ళు ఛెళ్ళుమన్నై. బుర్రలో భూగోళం తిరిగింది. కళ్ళు బైర్లు కమ్మినై.

"నా మాట నమ్ము బావా ! నీకు దండం బెడ్తగాని నా కూలీపైస పైసలియ్యి బావా ! నా భార్యాపిల్లలు ఆకలితోని నకనకలాడిపోతుండ్రు బావా ?" గోడు వెళ్లబోసుకున్నాడు.

"మూడు ముడికాండ్ల పనికి మూడొందల కూలి దీసుకుంటావురా బద్మాష్ ! నీకు కండ్లు నెత్తికెక్కినై." గుడ్లురిమి వెనక్కు తోసేశాడు. వెల్లకిలా పడిపోయాడు. కళ్లల్లో సూర్య ప్రతాపం జిగేల్‌మంది. కళ్లు మూసుకుపోయినై.

"అమ్మయ్యో... నీ కాల్మొక్త బావా ! నేనేపాపమెరుగ. నా కూలి పైసలిచ్చెయ్ బావా !" శక్తినంతా కూడదీసుకొని లేచి, బతిమాలుతూ కాళ్లు పట్టుకున్నాడు. తలగొట్టుకున్నాడు.

గది తలుపులోంచి తొంగి చూస్తున్న రంభ గుండె చెరువైపోయింది. కనుకొలుకుల్లో నీటి బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నై. బయటకు వస్తే చంపి పారేస్తానన్న భర్త ఆదేశం కలవర పెడుతోంది. అయినా నవనాడుల్లో రోషం పొంగుకొస్తోంది.

"అట్లనా... అయితే నా పెండ్లాన్ని మానభంగం చేసినవని పోలీస్ స్టేషన్ల రిపోర్టిస్తా. నీ పైసలు అక్కడనే వసూలు జేస్కోపో" లక్ష్మీపతి మరింత రెచ్చిపోయి భుజాల మీద చేతులేసి బజార్లోకి గెంటేశాడు.

బొక్కబోర్లా పడిపోయాడు బ్రహ్మచారి. కాళ్ళూ, చేతులు, మొహం దుమ్ముగొట్టుకు పోయినై. ఏడుపొస్తోంది.

"పల్లెటూర్ల పనోడంటే పశువుకంటే హీనమైపోయిండు... దేవుడా దేవుడా !" దీనంగా గొణుక్కున్నాడు. నరాల్లో సత్తువ చచ్చిపోయింది.

లేచి నిల్చుండాలనే ప్రయత్నం. సగం లేచి మళ్ళీ పడిపోయాడు. మళ్ళీ లేవాలని బలాన్నంత కూడగట్టుకుంటున్నాడు.

"అన్యాయం, అక్రమం" ఉరుములా విన్పించింది. నిప్పులు కక్కుతూ, రంభ పరుగెత్తుకొచ్చింది. కుడిచేతిలో పొడగాటి ఖడ్గం... విజయదశమినాడు పూజలందుకునే కత్తి... తళతళా మెరిసిపోతోంది. కొద్దిసేపటి క్రితమే తలంటు పోసుకుందేమో, విరబోసిన వెంట్రుకలు ఎగసిపడుతున్న గుండెల మీద బుసలు కొడుతున్న నల్లనాగుల్లా కదులుతున్నై.

కొద్దిసేపు కొయ్యబారాడు లక్ష్మీపతి.

"ఏంది... ఏందే రంభా... !" సర్దుకున్నాడు. పౌరుషం పొంగుకొస్తోంది. ముందుకొచ్చి అడ్డంగా నుంచున్నాడు.

"నువ్వేందుకొచ్చినవే. అది అమ్మవారి ఖడ్గం".

"నేను ధర్మాన్ని రక్షించేందుకొచ్చిన" గొంతులో గాంభీర్యం. మొహం ఎర్రగా... విరబూసిన మంకెన పూవులాగుంది. మెడలో రవ్వల నెక్లెస్. రంగుల రవ్వల్లో సూర్యకిరాణాల తాలూకు మెరుపులు.

"నీ బొంద. ధర్మం గిర్మం నీకెందుకే..." ఇంకేదో అనబోయాడు చేతులు తిప్పుతూ.

"చుప్ ... దుర్మార్గుడా. నోర్ముయ్ !" కత్తి మెరుపులా గాల్లోకి లేచింది. కళ్ళు జిగేల్ మన్నై.

రంభ కాదది జగదాంబ ! లక్ష్మీపతి హైరానా.

"ఆఁ ఆఁ ..." హడలిపోయాడు. "ఆగు ఆగాగు... చంపుతావా ! నన్ను చంపితే నీ పసుపు కుంకుమలు పరారైపోతై తెల్సా !" మొహానికి చేతులు అడ్డంగా పెట్టుకున్నాడు.

"పోయినా ఫరవాలేదు. ఆడది తెగిస్తే అగ్గిపోతది. పాపం ! రక్తాన్ని చెమటజేసి వారం రోజులు కష్టపడి నగజేస్తే... పైసలెగ్గొట్టేందుకు నన్ను మానభంగం జేసిండంటావా ? పెండ్లామంటే పెంటమీది పోగనుకున్నావా ? ఆడదాని గ్గూడా ఆత్మాభిమానముంటది" లేచిన కత్తి అలాగే ఉంది. సూర్యకిరణాలు కత్తి మీద వాలి పరావర్తనం చెంది లక్ష్మీపతి కళ్ళ మీదాడుకుంటున్నై. రంభ కళ్లు విశాలమై పోయినై. అచ్చం... ఆదిశక్తి, అమ్మవారిలాగుంది.

లక్ష్మీపతి గర్వం సర్వం గాల్లో కలసిపోయింది. ప్రాణభయంతో అల్లాడిపోతున్నాడు. వెన్నుపూసలోంచి వణుకుముంచుకొస్తోంది.

"తప్పైంది ... తప్పైంది రంభా !" చేతులు జోడించాడు. "ఇప్పుడేం జెయ్యాలే ?"

"ముందు బ్రహ్మమన్నను లేపి అరుగు మీద కూచోబెట్టు".

అలాగే చేశాడు.

"ఐదు వందల రూపాయలు తెచ్చివ్వు",

క్షణంలో వెళ్ళి అరక్షణంలో తెచ్చిచ్చాడు.

"అతని కాళ్ళకు మొక్కు".

"ఇంత బతుకు బతికి ఇంటెన్క చచ్చినట్లు... వాని కాళ్ళు పట్టుకోవాల్నా ?" ఏ క్షణంలో కత్తివేటు పడుతుందోననే భయంతో వణికిపోతున్నాడు. "నువ్వు.... నువ్వు... నా పెండ్లానివి గదా !" బింకం.

"అంతకంటే ముందు భారత స్త్రీని. ఈ దేశంల ఆడది దేన్నైనా సహిస్తుందిగాని కట్టుకున్న మొగడే రంకుతనం అంటగడితే ప్రాణాల్కు తెగిస్తుంది. నాలిక చీరిపారేస్తుంది జాగ్రత్తా !"

"నన్ను మన్నించు బ్రహ్మం బావా !" వణికే చేతుల్తో బ్రహ్మచారి కాళ్లకు మొక్కి అతని పక్కన కూచున్నాడు.

తలుపు సందుల్లోంచి తమాషా చూస్తున్న వీధి జనాలు తలుపులు తెరుచుకొని బయటికొచ్చేశారు. చుట్టూ మూగారు.

"అమ్మా ... చెల్లెమ్మా.... శాంతించమ్మా !" బ్రహ్మం నరాల్లో ధైర్యం జరజరపాకింది. "నీ మొగణ్ణి నువ్వే దారిల పెట్టమ్మా" చేతులెత్తి నమస్కరించి "దయచేసి ఆ కత్తి దించమ్మా" ప్రార్థించాడు. అతని కళ్ళల్లో ఆనందాశ్చర్యాలు తొణికిసలాడుతున్నై.

అటు కత్తి తళతళల్తో దిగుతూంటే ఇటు ఎన్నో జతల కళ్ళు మిలమిలలాడిపోతున్నై.

"అయిగిరినందిని నందిత మోదిని..."

ఎదురింటి... గుడి పూజారి నాలుక మీద స్తోత్రం కదలాడ్తూంది.

**31 డిసెంబర్, 2001 మరియు 7 జనవరి, 2002**
**'జాగృతి' వార పత్రికలో ప్రచురితం.**

